క్లుప్తంగా

వీరవల్లి అగ్రహారంలో మోదమ్మకు జలాభిషేకం



మోదమ్మకు జలాభిషేకం చేస్తున్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో మోదకొండమ్మకు ఆదివారం జలాభిషేకం చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు, మంగరాజు సారథ్యంలో మాలధారణ భక్తులు అమ్మవారి పీఠం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 30న అమ్మవారి ఘటాలు, సారె ఊరేగింపు వచ్చే నెల 4న అమ్మవారి ఊరేగింపు ఇరుముడులు ధరించి, పాదయాత్రగా మాడుగుల వెళ్లి అక్కడ మాలధారణ విసర్జన చేస్తామన్నారు.

నేడు కె.జె.పురంలో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కె.జె.పురం గ్రామములో మూడో రోజు సోమవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జామి రమణబాబు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించడంతోపాటు ప్రజా సమస్యలను తెలుసుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

31న వామలింగేశ్వర కల్యాణం

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 31న వార్షిక కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ ఆదివారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కోటమ్మతల్లి ఆలయానికి 21 చీరల వితరణ



చీరలు అందజేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

నాతవరం: అంకంరెడ్డి జమీల్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటమ్మతల్లి ఆలయ కమిటీకి 21 చీరలు వితరణగా అందజేశారు. ఆదివారం జమీల్ కుటుంబ సభ్యులతోపాటు ఆయన అభిమానులు ఆలయ ధర్మకర్త అంకంరెడ్డి కొండయ్యకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరక రేణుక, ఉప సర్పంచ్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా కురిసిన వర్షం

మాడుగుల రూరల్: మండలంలో ఆదివారం ఉదయం నుంచి కాసిన ఎండతోపాటు ఉక్కపోతకు ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి స్వల్పంగా వర్షం కురిసింది. దీనికి తోడు ఈదురు గాలులు వీచాయి. కొంత సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఒకేసారి బదిలీలు చేయాలని వినతి



ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సూరిబాబు

నర్సీపట్నం: వీఆర్వోలందరికీ ఒకేసారి బదిలీ చేయాలని ఏపీ వీఆర్వోల అసోసియేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లాలం సూరిబాబు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రేడ్-1, 2 వీఆర్వోలకు బదిలీ షెడ్యూల్ ఒకటే ఉండాలన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి ఒకేసారి బదిలీలు చేయాలని కోరారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం



ఇప్పటి వరకు శిథిల భవనంలో నడుస్తున్న ఆస్పత్రి



తురకలపూడిలో కొత్తగా నిర్మించిన ఆస్పత్రి

- తురకలపూడిలో రూ.1.61 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం
- 30 ఎర్రవాయి గ్రామాల ప్రజలకు తీరిన కల
- నేడు ప్రారంభించనున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఎర్రవాయి గ్రామాల ప్రజల కల ఎట్టకేలకు తీరింది. ఇప్పటి వరకు తురకలపూడిలోని శిథిల ఆస్పత్రి భవనంలో అరకొర వసతుల మధ్య రోగులకు వైద్య సేవలు అందేవి. నేటి నుంచి నూతన భవనం అందుబాటులోకి రానుంది. ఇకనుంచి వైద్య సేవలు 24 గంటలపాటు నిరంతరాయంగా అందనున్నాయి. ఈ భవనాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి సోమవారం ప్రారంభించనున్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు హాజరు కానున్నారు.

వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పథకంలో రూ.1.61 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం నడుస్తున్న శిథిలమైన ఆస్పత్రి పక్కనే కొత్తగా నిర్మాణ పనులు చేపట్టారు. ఇద్దరు వైద్యులు ఉండేలా గదులతోపాటు సిబ్బంది, ఆపరేషన్ థియేటర్, మగ, ఆడ పేషెంట్లు విశ్రాంతి తీసుకునే గదులు, మందులు నిల్వ చేసే గది, రక్త పరీక్షలతోపాటు ఇతర సకల సదుపాయాలతో విశాలంగా ఆస్పత్రి నిర్మించారు.

30 గ్రామాల ప్రజలకు తీరిన కష్టాలు...

బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో 30 ఎర్రవాయి గ్రామాల ప్రజలకు ఎటువంటి వైద్య సేవలైనా తురకలపూడి ఆస్పత్రి మీదే ఆధారపడ్డారు. పీపీ అగ్రహారం, చింతపాక, సీతయ్యపేట, పెదపూడి, పంగిడి, ఎస్ఎల్ నగర్, గొర్లెపాలెం, ఉప్పరగూడెం, కరక, చిట్టియ్యపాలెం, త్రిపురంతోపాటు రావికమతం మండలం తోటకూరపాలెం, తట్టబంద, బలిజపాలెం తదితర గ్రామాలకు సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో దగ్గరలో తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రిపై ఆధారపడి వైద్య సేవలు పొందుతున్నారు. యాభై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆస్పత్రి పూర్తిగా శిథిలమైంది. ఏ మాత్రం వర్షం కురిసినా శ్లాబు నుంచి నీరు లీకై మందులు తడిచిపోయి రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందేవికావు. పలువురు రోగులు శిథిల ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందలేక అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, విశాఖ తదితర దూర ప్రాంతాల్లో ఆస్పత్రులను ఆశ్రయించి వైద్య సేవలు పొందేవారు. పదేళ్లుగా ఈ ఆస్పత్రి శిథిలమైన గత టీడీపీ ప్రభుత్వంలో నాయకులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో కొత్త ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సకల సౌకర్యాలతో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మాకు సరైన రవాణా సదుపాయం లేక ప్రైవేటు ఆస్పత్రులు లేక ప్రభుత్వ వైద్య సేవల పైనే ఆధారపడి ఉన్నాం. పదేళ్లుగా తురకలపూడి ఆస్పత్రి శిథిలమైంది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో సీఎం జగనన్న మా గ్రామంలో ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తి చేశారు. మేమంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. మా ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందుతాయి.

– బుదిరెడ్డి నాగభూషణం, కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి, తురకలపూడి

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు



వ్యవసాయాధికారి సోమశేఖర్

కె.కోటపాడు: ఖరీఫ్ సాగుకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులను వేయాలని ఏవో పి.సోమశేఖర్ తెలిపారు. వ్యవసాయశాఖ సహాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట ఎరువుల్లో భాగంగా 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సాగు కాలంలో మండల రైతులు వరినాట్లు జూలై రెండో వారం నుంచి నాల్గో వారం వరకూ వేయనున్నట్లు తెలిపారు. ఇంకా నాట్లు వేసేందుకు సమయం ఉన్నందున ఈలోగా ఆయా పొలాల్లో పచ్చిరొట్ట ఎరువు వేసుకుని బాగా కలియదున్నాలని సూచించారు. ఈ విధంగా చేయడం వల్ల భూమిలో సూక్ష్మధాతువుల లోపాన్ని నివారించడంతోపాటు భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. భూమిలో వర్షపునీటి నిల్వ సామర్థ్యం మెరుగవుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులను ఆర్బీకేల్లో రాయితీపై అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

మాకవరపాలెం: రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో చిరంజీవి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించే జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ పది కేజీలు రూ.395, జనుము రూ.420, పిల్లిపెసర రూ.390 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

31న మహాలక్ష్మమ్మ ఆలయం ప్రారంభం

చోడవరం రూరల్: అంబేరుపురంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మ వారి ఆలయాన్ని ఈనెల 31న ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.10 గంటల ఆలయాన్ని ప్రారంభించి, అదే సమయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేస్తామన్నారు. ముందు రోజు మధ్యాహ్నం వినాయక పూజ ఆది వాసములు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట అనంతరం విశేష పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం గుడి వద్ద జాతర నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

రేపు గొండుపాలెంలో జాబ్‌మేళా

కె.కోటపాడు: గొండుపాలెంలో ఈ నెల 30న అపోలో ఫార్మసీ యాజమాన్యం సహకారంతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ ఉత్తీర్ణులైన ఉద్యోగార్థులు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 85550 81900కు సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తిగత శుభ్రత ముఖ్యం



మాట్లాడుతున్న వైద్యాధికారి నిర్మల



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ భవాని

కె.కోటపాడు: మహిళలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత శుభ్రతను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఆదివారం చౌడువాడలో మహిళలకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుతక్రమ సమయంలో ప్రతీ నాలుగు గంటలకు ఒకమారు నేప్‌కిన్‌ను శుభ్రపర్చుకోవాలని సూచించారు. వీటితోపాటు శరీరంపై దుస్తులను ఎప్పటికప్పుడు పరిశుభ్రపర్చుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏఎన్ఎం సన్యాసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నర్సీపట్నం: మహిళలు ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ భవాని సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు వ్యక్తిగత శుభ్రత చాలా అవసరమన్నారు. దీని వల్ల వ్యాధులు దరి చేరవన్నారు. రుతుస్రావ సమయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. మెప్మా కోఆర్డినేటర్ రవి, సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ పండగ గోడపత్రిక విడుదల



గోడపత్రిక విడుదల చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, కమిటీ సభ్యులు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ పండగ గోడపత్రికను ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రతిరూపమైన సతకం పట్టువద్ద ఆదివారం విడుదల చేశారు. ఇక్కడ వచ్చే నెల 6న జరగనున్న పండుగ సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, బి.పైడియ్యానాయుడు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

దేవరాపల్లి: మారేపల్లి శారదా నది ఒడ్డున పాండవుల మెట్టపై నూతన ఆలయ పునఃప్రతిష్ట వేడుకల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కవిత అగ్రి ఫార్మ్స్ అధినేత డి.వి. అప్పారావు సౌజన్యంతో వాకపల్లి, వెంకటరాజుపురం, తెనుగుపూడి, మారేపల్లి, తారువ, తిమిరాం గ్రామాల మీదుగా ట్రాక్టర్లపై భూవరహా, జయ, విజయ, శ్రీచక్ర మేరువు, గరుడ, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహాలకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామగ్రామాన ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దాంతో వేంకటేశ్వర, గోవింద నామస్మరణతో మారుమోగాయి. అనంతరం ఆలయం వద్దకు విగ్రహాలను చేర్చి వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ సోమ, మంగళ వారం హోమాలు నిర్వహించనున్నారు.

మోదకొండమ్మ పండగకు ఏర్పాట్లు

- నేటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం



పాత బస్టాండ్‌లో భారీ విద్యుత్ సెట్టింగ్‌కు ఏర్పాట్లు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా సోమవారం నుంచి పలు సాంస్కృతి కార్యక్రమాలు జరగనున్నాయి. మహరాజుల కోటలో ఆరు రోజులపాటు సురభి నాటకాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో భారీ విద్యుత్ సెట్టింగ్‌లకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం నుంచి సతకంపట్టు వరకు కళ్లుమిరిమిట్లు గొలిపే విధంగా విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. ఇప్పటికే అమ్మవారి ప్రధాన ఆలయాన్ని రంగులతో అలంకరించారు. అమ్మవారి విగ్రహానికి రంగులతో తీర్చిదిద్ది ఆభరణాలు అలంకరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మవారి జాతరను అత్యధిక పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించడానికి ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేస్తోంది.



ఒక్క పేదవాడికైనా ఇంటి స్థలం ఇచ్చావా?

అయ్యన్నపాత్రుడిపై ఎమ్మెల్యే గణేష్ ధ్వజం



జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్, నాయకులు

నాతవరం: జగనన్న లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణాలు చూస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సూచించారు. నాతవరం, వల్సంపేట పంచాయతీల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రెండు పంచాయతీలకు సంబంధించి లేఅవుట్లలో 300పైగా పేదలకు స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేశామన్నారు. దాంతో ఇక్కడ లబ్ధిదారులు ఉత్సాహంతో ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని, శత శాతం పూర్తి చేసేందుకు వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జగనన్న లేఅవుట్ చూస్తే ఇదొక్క గ్రామంగా తలపిస్తుందన్నారు. లబ్ధిదారుల గుండెల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దీన్ని చూసి జీర్ణించుకోలేక అయ్యన్నపాత్రుడు పిచ్చిప్రేలాపనలు పేలుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో ఒక్క పేదవాడికైనా ఇంటి స్థలం ఇచ్చావా అంటూ ప్రశ్నించారు. ఇదేం ఖర్మ పేరుతో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు ఎన్ని మాయమాటలు చెప్పినా, తాము అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో కొట్టుకుపోతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మైనం శ్రీనాగగోపీ, పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇట్టంశెట్టి శ్రీను, మాజీ సర్పంచ్ సుర్ల యోగీశ్వరుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పి.కె.గూడెం సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండల కమిటీ చైర్మన్ శెట్టి నూకరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలి

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కోరారు. మండలంలోని కె.వి.శరభవరం పంచాయతీలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏ పథకం కోసమైనా ప్రజలు నేరుగా సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మైనం నాగగోపీ, పైల సునీల్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శెట్టి నూకరాజు, సర్పంచ్‌లు వాకపల్లి చింతల్లి, లగుడు నాగేశ్వరరావు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయ భూముల అన్యాక్రాంతంపై విచారణ



ఆలయాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారి రవికిరణ్, అధికారులు

రావికమతం: మేడివాడలో సీతారామాలయాన్ని మండల ప్రత్యేకాధికారి రవికిరణ్, ఎంపీడీవో వెంకన్నబాబు, ఇతర అధికారులు ఆదివారం సందర్శించారు. ఆలయానికి చెందిన 45 ఎకరాల భూములు అన్యాక్రాంతమై సరైన ఆదాయం లేక ధూపదీప నైవేద్యాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తక్షణమే చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామానికి వచ్చిన కలెక్టర్ రవిపట్టాన్ శెట్టికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. అర్చకులతోపాటు గ్రామపెద్దలను ఆలయ భూములు, చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి మేడివాడ, టి.అర్జాపురం, గుమ్మాళ్లపాడు, పి.పొన్నవోలు, కుముందానిపేట, కానాడ గ్రామాల్లో 45 ఎకరాల భూములుండేవని, వాటికి సంబంధించిన పత్రాలు, సర్వే నంబర్లతో సహా అందించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

200 రోజుల 'ఉపాధి' కల్పించాలి



వేతనదారులతో మాట్లాడుతున్న నాయుడుబాబు

కె.కోటపాడు: ఉపాధి పనులను ఏడాదికి 200 రోజులపాటు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు కోరారు. ఆదివారం సూర్రెడ్డిపాలెంలో బండారువాని చెరువులో ఉపాధి పనుల వద్ద వేతనదారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులకు ఏడాదికి బడ్జెట్‌లో రెండు లక్షల ఇరవై వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేతనదారులకు వేసవి భత్యం మంజూరు చేయాలని కోరారు. ఉపాధి వేతనదారుల సమస్యలపై సోమవారం అనకాపల్లిలో చలో కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు. సీపీఎం నాయకులు నారాయణమూర్తి, యర్రా దేముడు, రొంగలి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

వరి విత్తనాలకు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న ఏవో విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట/రోలుగుంట: మండల రైతులు ఖరీఫ్ సబ్సిడీ వరి విత్తనాల కోసం ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవోలు భాస్కర రావు, ఎస్. విజయలక్ష్మి తెలిపారు. ఆర్‌జీఎల్(శ్రీకాకుళం సన్నాలు) 30 కేజీల బస్తా రూ.850, సోనామసూరి 30 కేజీల బస్తా రూ.830, సాంబమసూరి 25 కేజీల బస్తా రూ.710, స్వర్ణ 30 కేజీల బస్తా రూ.850, అమర 30 కేజీల బస్తా రూ.860గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ఆయా గ్రామాల రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. విత్తనాల కోసం గతేడాది మాదిరిగానే ముందుగా ఎన్ని బ్యాగులు ఏ రకం విత్తనాలు కావాలో నగదు చెల్లించి రసీదు తీసుకుని, ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. వీరికి మాత్రమే విత్తనాలు సరఫరా చేస్తామన్నారు.

ఈదురుగాలులతో వర్షం



వెంకునాయుడుపేటలో విరిగిపడిన విద్యుత్ స్తంభం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం



బుచ్చెయ్యపేటలో చల్లబడ్డ వాతావరణం

నర్సీపట్నం: ఈదురుగాలులతో కూడిన వర్షం ఆదివారం మధ్యాహ్నం నర్సీపట్నంలో కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కసారిగా వాతావరణ చల్లబడి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం ప్రారంభమైంది. గంటకుపైగా మోస్తరు కురిసింది. ఈదురుగాలులకు పట్టణంలో వెంకునాయుడుపేటలోని విద్యుత్ స్తంభం విరిగిపడింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ అధికారులు వెనువెంటనే సరఫరాను పునరుద్ధరించారు.

పలు గ్రామాల్లో మోస్తరు వర్షం

రోలుగుంట/బుచ్చెయ్యపేట: గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు ప్రతాపం చూపించి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కొంత సేపటిలోనే ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం పడింది. దీంతో భూముల్లో తడులు ఏర్పడ్డాయి. పదును లేక అపరాలు, నువ్వు పంటలు ఎండలకు వడలిపోతున్నాయి. దీంతో వరుణుడి కోసం రైతులు చూస్తున్న తరుణంలో కురిసిన వర్షంతో జీవం పోసినట్టయింది. రోలుగుంటతోపాటు వెలంకాయలపాలెం, కొండపాలెం, భోగాపురం, కంచుగుమల తదితర గ్రామాల్లో వర్షం పడింది. బుచ్చెయ్యపేటలోని పలు గ్రామాల్లో గాలులకు చెట్టు కొమ్మలు విరిగిపడగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఘనంగా పట్టాలమ్మ పండగ

మాకవరపాలెం: స్థానిక కిందివీధిలో పట్టాలమ్మతల్లి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం స్థానిక మహిళల ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన ఉత్సాహంగా నిర్వహించారు.